## వెళ్లిపోతున్నా.. వెతకొద్దు



మాహియా తరన్నుమ్ (ఫైల్)

బంజారాహిల్స్,అక్టోబర్ 4: ఆస్ట్రేలియా వెళ్తున్నాను.. నా కోసం వెతకవద్దు.. అంటూ వాట్సాప్‌లో కుటుంబ సభ్యులకు మెసేజ్ పెట్టిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. షేక్‌పేట సమీపంలోని సబ్జా కాలనీలో నివాసముంటున్న మాహియా తరన్నుమ్(24) డీ- ఫార్మసీ పూర్తిచేసి, సోమాజిగూడలోని ఓ ఆస్పత్రిలో గత పది రోజులుగా శిక్షణకు వెళ్తోంది. మంగళవారం ఉదయం ఇంట్లోంచి ఆస్పత్రికి వెళ్లిన ఆమె ఫోన్ నుంచి మధ్యాహ్నం 3గంటల సమయంలో తండ్రి గఫార్‌కు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. 'నేను ఆస్ట్రేలియా వెళ్తున్నాను.. నా కోసం వెతకవద్దు..' అంటూ వాట్సాప్ మెసేజ్‌లో ఉంది. దీంతో ఆందోళనకు గురైన తండ్రి గఫార్ ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. పలు ప్రాంతాల్లో గాలించినా లాభం లేకపోవడంతో బుధవారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, గత 8 నెలలుగా తన సహచరుడైన ఓ డాక్టర్‌తో తన కుమార్తె ప్రేమలో ఉన్నదని, బీహార్‌కు చెందిన వ్యక్తితో పెళ్లి చేయడం ఇష్టం లేకపోవడంతో తాము పెళ్లికి అంగీకరించలేదంటూ తండ్రి గఫార్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## రాంగ్‌రూట్‌లో వెళ్లడమే కాకుండా..

### ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దుర్భాషలు

బంజారాహిల్స్, అక్టోబర్ 4: రాంగ్‌రూట్‌లో ప్రమాదకరంగా బైక్‌పై వెళ్తుండగా ఫొటో తీసిన ట్రాఫిక్ కానిస్టేబుల్ పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు మహిళలపై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ కావడి శేఖర్ మంగళవారం సాయంత్రం జూబ్లీహిల్స్ రోడ్ నం. 45లోని హార్ట్ కప్ సమీపంలో విధులు నిర్వహిస్తున్నాడు. అదే సమయంలో యాక్టివా బైక్‌పై వచ్చిన ఇద్దరు మహిళలు.. అత్యంత ప్రమాదకరంగా వాహనం నడిపిస్తూ రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. వారిని ఆపేందుకు ప్రయత్నిస్తున్నా.. వేగంగా ముందుకు దూసుకురావడంతో కానిస్టేబుల్ శేఖర్ వారు నడిపిస్తున్న యాక్టివా బైక్ ఫొటో తీశాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన మహిళలు.. కానిస్టేబుల్ వద్దకు వచ్చి బూతులు తిట్టడంతో పాటు దాడికి పాల్పడ్డారు. తన విధులకు ఆటంకం కలిగించడంతో పాటు తీవ్ర పదజాలంతో దూషణలకు పాల్పడిన ఇద్దరు మహిళలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కానిస్టేబుల్ శేఖర్ మంగళవారం రాత్రి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇద్దరు మహిళలపై ఐపీసీ 353 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 38వ ఫ్లోర్ నుంచి పడి.. ఏసీ ఇంజినీర్ దుర్మరణం

మణికొండ, అక్టోబర్ 4 : ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న ఓ భవనం పైనుంచి పడి ఏసీ ఇంజినీర్ దుర్మరణం చెందాడు. ఈ ఘటన బుధవారం నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలో నివాసముంటున్న అడప వెంకట భీమేశ్ కొన్నాళ్లుగా నార్సింగిలోని ఓ ప్రముఖ నిర్మాణ రంగ సంస్థలో ఏసీ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం విధులలో భాగంగా 38వ ఫ్లోర్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తుండగా.. భీమేశ్ ప్రమాదవశాత్తు కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.

## క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే అకౌంట్ నుంచి 70 వేలు మాయం

### తెలివిగా బోల్తా కొట్టించిన సైబర్ నేరగాళ్లు

బంజారాహిల్స్, అక్టోబర్ 4: ఓఎల్‌ఎక్స్‌లో డైనింగ్ టేబుల్‌ను అమ్మడానికి ప్రయత్నించిన వ్యక్తిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించి డబ్బులు కాజేశారు. ఈ ఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి చల్లా ఫణిబాబు గత నెల 28న తన ఇంట్లో నిరుపయోగంగా ఉన్న డైనింగ్ టేబుల్‌తో పాటు ఆరు కుర్చీలను విక్రయించేందుకు ఓఎల్‌ఎక్స్‌లో ప్రకటన పెట్టారు. 5 నిమిషాల్లోనే గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి.. తాను రూ.35 వేలకు వాటిని కొంటానని నమ్మబలికాడు. కాసేపట్లో తన మనుషులు వచ్చి డైనింగ్ టేబుల్‌ను తీసుకువెళ్తారని చెప్పాడు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ముందుగా రూ.5 పంపిస్తానని, అవి వచ్చాయని కన్ఫర్మ్ చేస్తే రూ.35వేలు ట్రాన్స్‌ఫర్ చేస్తానని చెప్పాడు. లైన్‌లో ఉన్నప్పుడే క్యూఆర్ కోడ్‌ను పంపించాడు. దాన్ని ఫణిబాబు స్కాన్ చేసి, పిన్ నంబర్ కూడా చెప్పాడు. ఆ తర్వాత రూ.5 వచ్చాయా.. అంటూ నేరగాడు ప్రశ్నించాడు. డబ్బులు రాలేదని చెప్పగా.. మరోసారి రూ.5 పంపిస్తానంటూ.. రెండోసారి క్యూ ఆర్‌కోడ్ పంపించాడు. రెండుసార్లు ఇదే విధంగా స్కాన్ చేయడంతో అనుమానం వచ్చిన ఫణిబాబు తన అకౌంట్‌ను పరిశీలించగా.. రూ. 35వేలు చొప్పున రెండుసార్లు మొత్తం రూ.70వేలు మాయమైనట్లు గుర్తించాడు. ఈ మేరకు బాధితుడు బుధవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గోవా నుంచి డ్రగ్స్..



సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): గోవా నుంచి డ్రగ్స్ తెచ్చి హైదరాబాద్, రాజమండ్రిలో విక్రయిస్తున్న ముఠాను తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్ బ్యూరో, సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 18 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. టీనాబ్ ఎస్పీ గుమ్మి చక్రవర్తి కథనం ప్రకారం.. కేరళ రాష్ట్రానికి చెందిన ఎం.జి.అఖిల్ గోవాలో ఉంటాడు. అంజనా బీచ్ సమీపంలో గెస్ట్ హౌస్ నిర్వహిస్తూ.. టూరిస్టులకు డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. ఈస్ట్‌గోదావరి జిల్లాకు చెందిన సూర్య కిషన్, రోహన్ పాల్ తరచూ గోవాకు వెళ్తుండటంతో అఖిల్ పరిచయమయ్యాడు. దీంతో తరచూ గోవాకు వెళ్లి అఖిల్ వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసి హైదరాబాద్, రాజమండ్రిలో విక్రయిస్తున్నారు. హైదరాబాద్‌లోని హబ్సిగూడకు చెందిన తోట సురేందర్, బిలీ అరుణ్‌కుమార్‌కు కూడా డ్రగ్స్ విక్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత అఖిల్ డ్రగ్స్ విక్రయించేందుకు హైదరాబాద్‌కు వచ్చాడు. చందానగర్ ప్రాంతంలో అఖిల్, మిగతా నలుగురు కలుసుకున్నారు. విశ్వసనీయ సమాచారంతో ఇన్‌స్పెక్టర్లు రమేశ్ రెడ్డి, రాజశేఖర్, డానియెల్ బృందాలు ఈ ముఠాను అదుపులోకి తీసుకున్నాయి. నిందితుల నుంచి 18 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, ఒక బైక్, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం చందానగర్ పోలీసులకు అప్పగించారు.

# అదృశ్యమై.. చెరువులో తేలి..

### టీవీ కెమెరామన్ ఆత్మహత్య



నన్నపనేని కార్తీక్ (ఫైల్)

బంజారాహిల్స్, అక్టోబర్ 4: అనుమానాస్పద స్థితిలో ఫిలింనగర్‌లో అదృశ్యమైన యువకుడు శామీర్‌పేట చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా జిల్లాకు చెందిన నన్నపనేని కార్తీక్ (28) ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్ కాలనీలో స్నేహితులు మహిపాల్, ప్రవీణ్‌తో కలిసి గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఓ ప్రైవేట్ టీవీ చానల్‌లో కెమెరా మెన్‌గా పనిచేస్తున్న కార్తీక్.. ఈనెల 2న ఇంటి నుంచి తన పల్సర్ బైక్‌పై డ్యూటీకి వెళ్లాడు. రాత్రి తిరిగి గదికి రాకపోవడంతో స్నేహితుడు ప్రవీణ్ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. డ్యూటీలో బిజీగా ఉండవచ్చని స్నేహితుడు భావించాడు. కాగా, మంగళవారం సాయంత్రమైన కార్తీక్ ఆచూకీ తెలియలేదు. డ్యూటీకి కూడా రాలేదని తెలియడంతో స్నేహితుడు ప్రవీణ్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, శామీర్‌పేట చెరువు సమీపంలో కార్తీక్‌కు చెందిన బైక్‌తోపాటు అతడి సెల్‌ఫోన్ లభించడంతో అక్కడి పోలీసులు ఫిలింనగర్ పోలీసులకు సమాచారమిచ్చారు. బుధవారం ఉదయం శామీర్‌పేట చెరువులో కార్తీక్ మృతదేహం లభించింది. కార్తీక్ చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు చెబుతున్నారు.

## క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో.. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థుల ప్రతిభ




జూబ్లీహిల్స్, అక్టోబర్4: క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారని కేఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ అన్నారు. అమెరికాకు చెందిన నూటానిక్స్ అనే అంతర్జాతీయ కంపెనీలో రూ.50.57 లక్షల వార్షిక జీతంతో కూడిన ఉద్యోగాలకు విజయవాడ క్యాంపస్ నుంచి నలుగురు, హైదరాబాద్ క్యాంపస్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. హైదరాబాద్‌లోని యూనివర్సిటీ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ చదివి ఏడాది పూర్తిచేసుకున్న విద్యార్థులు ప్రాంగణ ఎంపికలో భాగంగా అంతర్జాతీయ కంపెనీ అయిన నూటానిక్స్ కంపెనీలో నిర్వహించిన ఎంపిక పరీక్షలో అర్హత పొంది రూ.50.57 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలను దక్కించుకోవడం హర్షణీయమన్నారు. కేఎల్ యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులకు వంద శాతం ఉద్యోగాలను అందించే లక్ష్యంతో తమ అధ్యాపకులు పనిచేస్తున్నారన్నారు. అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ జె.శ్రీనివాస రావు మాట్లాడుతూ.. ఎంతో స్నేహపూర్వకమైన వాతావరణంలో విద్యార్థులను ప్రపంచ స్థాయి నాయకులుగా తయారుచేయడమే కేఎల్ యూనివర్సిటీ ప్రధాన లక్ష్యమన్నారు. కేఎల్ హైదరాబాద్ బౌరంపేట క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన సంపూర్ణ సాంకేతిక విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగాలు పొందిన విద్యార్థినులు ఎం.సుజాత లక్ష్మి, రంగు ఉషశ్రీ, ఎం.జాహ్నవి లక్ష్మి, వి.శ్రావ్య చందన, హర్షిణి, హారిక, విద్యశ్రీలను, వారి తల్లిదండ్రులను యూనివర్సిటీ అధికారులు ఈ సందర్భంగా సన్మానించారు.

## బైకుపై వెళ్తుంటే.. బొలెరో ఎదురొచ్చి..



ఆంజనేయులు (ఫైల్)

శామీర్‌పేట, అక్టోబర్ 4 : రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. తూంకుంట మున్సిపాలిటీ మందాయిపల్లి గ్రామానికి చెందిన తాడెం ఆంజనేయులు(40) యాక్టివా బైక్‌పై పోతాయిపల్లి చెరువు సమీపంలో రోడ్డుపై వెళ్తున్నాడు. ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆంజనేయులు అక్కడికక్కడే మరణించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బొలెరో వాహనం నడిపిస్తున్న ప్రదీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## ఫిట్స్ వచ్చి.. మెట్ల పైనుంచి పడి..

వెంగళరావునగర్, అక్టోబర్ 4: తీవ్ర జ్వరంలో ఫిట్స్ వచ్చి ఓ యువకుడు మృతి చెండాడు. ఈ ఘటన ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రవిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్‌కు చెందిన రఘు (34) ఎస్ఆర్ నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ యాక్సిస్ బ్యాంక్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. జ్వరం రావడంతో మంగళవారం హాస్టల్‌లోనే ఉండి పోయిన రఘు.. సాయంత్రం మందులు కొనుగోలు చేసేందుకు సమీపంలోనే ఉన్న మెడికల్ షాపు వద్దకు వెళ్లాడు. మందులు తీసుకుని మెడికల్ షాపు మెట్లు దిగుతుండగా ఒక్కసారిగా కింద పడిపోయాడు. పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు రఘు ముక్కులో నుంచి రక్తం రావడాన్ని గమనించి అమీర్‌పేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే, అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హైఫీవర్ కారణంగా ఫిట్స్ రావడం వల్లే కింద పడిపోయినట్లు నిర్ధారణకు వచ్చారు. మృతుడికి తల్లిదండ్రులు లేరని, అనాథగా ఒక్కడే హాస్టల్‌లో ఉంటున్నట్లు ఎస్సై తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.